నమస్తే తెలంగాణ
జనగామ
3 | వరంగల్, శనివారం 8 మార్చి 2025 | JANAGAON

బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం ఎర్రవెల్లిలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్‌ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు.

వరంగల్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్

అంబర్ కిశోర్ ఝా రామగుండంకు బదిలీ

సుబేదారి, మార్చి7 : వరంగల్ నూతన పోలీస్ కమిషనర్‌గా సన్‌ప్రీత్ సింగ్ నియామకమయ్యారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడి నుంచి అంబర్ కిశోర్‌ఝా రామగుండం సీపీగా బదిలీ కాగా, ఆయన స్థానంలో సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ వచ్చారు. పంజాబ్‌కు చెందిన ఈయన 2011 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఈయనకు ఉమ్మడి జిల్లాలో పని చేసిన అనుభవం ఉంది. 2012లో ములుగు జిల్లా ఏఎస్పీగా, వరంగల్ రూరల్ జిల్లా ఓఎస్డీగా పనిచేశారు. ఆ తర్వాత హైదరాబాద్ ఎల్‌బీ నగర్ డీసీపీగా, జగిత్యాల ఎస్పీగా విధులు నిర్వర్తించారు. కాగా అంబర్ కిశోర్ ఝా 2023 అక్టోబర్ 13న వరంగల్ సీపీగా బాధ్యతలు చేపట్టి 17 నెలలు పనిచేశారు. 2023 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు, గతే డాదిలో జరిగిన ఎంపీ ఎన్నికల విధి నిర్వహణలో ఆయన సమర్థవంతంగా సేవలందించారు.

సీపీ సన్‌ప్రీత్ సింగ్

ఈస్ట్ జోన్ డీసీపీగా అంకిత్ కుమార్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ డీసీపీగా వెయిటింగ్‌లో ఉన్న అంకిత్ కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీసీపీ రవీందర్ ఎన్‌సీకి బదిలీ అయ్యారు.

క్రైం డీసీపీగా జనార్దన్: వరంగల్ పోలీసు కమిషనరేట్ క్రైం విభాగం డీసీపీగా బీ జనార్దన్ నియామకమయ్యారు. ట్రాన్స్‌కోలో అదనపు ఎస్పీగా పనిచేస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించి వరంగల్ క్రైం డీసీపీగా నియమించింది. జనార్దన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సై, ఇన్‌స్పెక్టర్, ఏసీపీగా పనిచేశారు.

హయగ్రీవచారి మైదానంలో ముస్తాబైన ఆటోషో ప్రాంగణం

ఆటోషోకు రారండోయ్

ఆటోషో కోసం ఏర్పాటు చేసిన స్టాల్స్

- నగరంలో నేడు, రేపు కార్యక్రమం
- ఒకేచోట హైరేంజ్ కార్లు, బైక్‌లు
- నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో నిర్వహణ

వరంగల్,మార్చి 7: వరంగల్ మహానగరంలో నేడు, రేపు రెండు రోజుల పాటు మెగా ఆటో షో నిర్వహించనున్నారు. హనుమకొండ హయగ్రీవాచారి గ్రౌండ్‌లో నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కానున్నది. రెండు రోజుల పాటు జరిగే ఆటోషోలో ఆటోమొబైల్ రంగంలోని ప్రముఖ కంపెనీలు భాగస్వామ్యం అవుతున్నాయి. తమ కంపెనీల హైరేంజ్ కార్లు, బైక్‌లను ప్రదర్శించనున్నాయి. రెండు రోజుల పాటు కొనసాగే ఆటోషోకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆటోమొబైల్‌రంగ నిపుణులు హాజరుకానున్నారు. ఒకే వేదికపై సుమారు 20కి పైగా ప్రముఖ కంపెనీల కార్లు, బైక్‌లు, ఎలక్ట్రిక్ బైక్‌లను ప్రదర్శించనున్నాయి. అన్ని వాహనాలను ఒకే చోట చూసుకోనే వెసులుబాటును మెగా ఆటోషో కల్పిస్తున్నది. సొంత వాహన కలను సాకారం చేసుకోవాలనుకునే వారి కోసం నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తంగా మెగా ఆటోషోను వరంగల్ నగరంలో ఏర్పాటుచేసింది.

ఓరుగల్లులోనే రజతోత్సవం

బీఆర్ఎస్ సిల్వర్‌జూబ్లీ బహిరంగ సభ ఇక్కడే

- లక్ష మందితో మీటింగ్‌కు ఏర్పాట్లు
- ఆదేశించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

వరంగల్, మార్చి 7(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పోరుగడ్డ ఓరుగల్లు మరో కీలక ఘట్టానికి వేదిక కానున్నది. బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను వరంగల్‌లోనే నిర్వహించాలని అధినేత కేసీఆర్ నిర్ణయించడం ప్రాధాన్యం సం తరించుకుంది. సామాజిక, రాజకీయ ఉద్యమాలకు మొదటినుంచీ చిరునామాగా ఉంటున్న చారిత్రక నగరం వరంగల్ సమైక్య పాలకుల దోపిడీని ఎదుర్కొని స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా మొదలైన తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర పోషించింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు అటు తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో, స్వరాష్ట్రంలో సంక్షేమ పాలన అమలులో సెంటిమెంట్‌గా నిలుస్తున్నది. రాష్ట్ర రాజకీయాల్లో కీలక మార్పులకు, బీఆర్ఎస్ ప్రస్థానంతో గొప్ప మలుపులకు వరంగల్ కేంద్రంగా ఉంటున్నది. ఈ పరంపర ఇంకా కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ 25వ వార్షికోత్సవ ఉత్సవాల బహిరంగ సభను వరంగల్‌లోనే నిర్వహించాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయించారు. గతంలో వరంగల్‌లో నిర్వహించిన బహిరంగ సభతో ప్రపంచ రికార్డు నమోదు చేయగా ఇప్పుడు మరోసారి అంతే స్థాయిలో భారీ సభకు సిద్ధమైంది. ఈమేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని శుక్రవారం బీఆర్ఎస్ ము ఖ్యనేతల సమావేశంలో కేసీఆర్ ఆదేశించారు. అధినేత ఆదేశాల మేర కు సమీక్ష సమవేశానికి వెళ్లే ముందే మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నగర శివారులోని ఉనికిచర్ల, భట్టుపల్లిలో స్థలాలను పరిశీలించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట నియోజకవర్గాల మధ్య ప్రాంతంలో భారీ బహిరంగసభ నిర్వహించేలా ప్రతిపాదనలు సిద్ధమైనట్లు తెలిసింది. ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్‌కు, కేసీఆర్ కు సెంటిమెంట్‌గా ఉన్న వరంగల్‌లో నే మరోసారి కీలకమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండడం గులాబీ శ్రేణులలో ఉత్సాహం నింపుతున్నది.

బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం భట్టుపల్లిలో స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

ఎండిన పొలంలో గొర్రెలు మేపుతున్న రైతు

ఎండిన ఆకేరు.. దూపతండా కన్నీరు

- అడుగంటిన బావులు, బోర్లు
- సాగునీరు లేక ఎండుతున్న పంటలు
- కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు
- పాలాల్లో జీవాలను వదిలిన అన్నదాతలు

పర్వతగిరి, మార్చి 7 : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం శివారు దూపతండా గ్రామంలో సాగు నీరందక సుమారు 100 ఎకరాల వరి, మక్కజొన్న ఎండిపోయింది. పక్కనే ఆకేరు వాగు ఉన్నా.. అందులో నీళ్లు లేక బావులు, బోర్లు అడుగంటడంతో రైతులు అల్లాడుతున్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా వచ్చిన నీరు ఆకేరు వాగులో నిల్వ ఉండేదని, దీంతో సాగుకు ఇబ్బంది పడలేదని రైతులు గుర్తుచేసుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాగు నీరు అందుబాటులో లేక పంటలు ఎండిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పులు తెచ్చి సాగు చేసిన పంట చేతికొచ్చేలా లేదని గ్రామంలోని సుమారు 45 మంది రైతులు కన్నీరు పెడుతున్నారు. కేసీఆర్ సారు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నీరు వదలడంతో ఆకేరు వాగు జలకళ సంతరించుకొని భూగర్భ జలాలు పైపైకి వచ్చేవని అంటున్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక వచ్చాక సాగు నీరు వదలడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, దీంతో నీళ్లు లేక తమకు కన్నీళ్లే మిగిలాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజుల క్రితం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందించిన ఆయన వెంటనే మంత్రి ఉత్తమ కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులకు నీరు విడుదల చేయాలని ఫోన్‌లో విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని వాపోయారు. ప్రభుత్వంపై ఆగ్రహంతో స్థానిక రైతు గుగులోత్ పూల్‌సింగ్ ఎండిన తన పొలంలో గొర్లు, మేకలను మేతకు వదిలారు. గత పదేళ్లలో ఎన్నడూ ఇలా పంటలు ఎండిపోలేదని వాపోయారు. కాంగ్రెస్ పాలనలో కష్టాలపాలవుతున్నామని కన్నీటి పర్యంతమయ్యారు.

పదేళ్లలో ఇంత ఇబ్బంది పడలే..

మా ఊళ్లో 45 మంది రైతులకు సంబంధించిన సుమారు వంద ఎకరాల్లో పంటలు సాగునీరు లేక ఎండిపోయినయ్. గత సీఎం కేసీఆర్ సార్ హయాంలో పదేళ్లలో ఎన్నడూ సాగునీటి కోసం ఇంత ఇబ్బంది పడలేదు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక సాగునీరు లేక పంటలు ఎండిపోయి చాలా నష్టపోతున్నం.

– ధరంసోత్ జామిరి, మాజీ సర్పంచ్, దూపతండా

ఎండిపోయిన మక్కజొన్న పంటను చూపుతున్న రైతు పూల్‌సింగ్

ఐదు ఎకరాల పంట ఎండిపోయింది

నేను, నా కొడుకు కలిసి ఐదు ఎకరా ల్లో వరి, మక్కజొన్న పంట సాగు చేశాం. రూ.లక్ష వరకు అప్పు తెచ్చి పెట్టుబడి పెడితే నష్టం వచ్చింది. నీటి సౌకర్యం లేక పంట మొత్తం ఎండింది. గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా సాగునీటి కరువు వచ్చింది.

– గుగులోత్ పూల్‌సింగ్, రైతు, దూపతండా

హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై వేటు

నమస్తే ఎఫెక్ట్

పెద్దవంగర, మార్చి 7: మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర పోలీస్ స్టేషన్‌లో మందు పార్టీ చేసుకున్న హెడ్ కానిస్టేబుల్ రాజారాం, కానిస్టేబుల్ సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ శుక్రవారం మల్టీ జోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'పోలీస్‌స్టేషన్‌లోనే మందు పార్టీ.. విధులు మరిచి మత్తులో సిబ్బంది' కథనానికి అధికారులు స్పందించారు. ఈ ఘటనపై విచారణ జరిపి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ రిపోర్ట్ పంపగా ఇద్దరిని సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉంటే స్థానికంగా ఎస్సై ఉండకపోవడం.. పోలీస్ స్టేషన్ సైతం పరిసరాలకు దూరంగా అటు వైపుగా ప్రజలు, జన సంచారం లేకుండా ఉండడంతోనే నిత్యం మందు పార్టీలు జరుగుతున్నాయని మండల ప్రజలు చర్చించుకుంటున్నారు.

వనితా వనం.. నిర్వహణలో నిర్లక్ష్యం

మహిళా దినోత్సవం జ్ఞాపకంగా బల్దియా ఆవరణలో ఏర్పాటు చేసిన వనితా వనం నిర్యక్షానికి గురవుతున్నది. నాలుగేళ్ల క్రితం అప్పటి కమిషనర్ పమేలా సత్పతి మహిళా దినోత్సవం రోజున వివిధ రకాల మొక్కలను మహిళా కార్పొరేటర్లతో నాటించారు. అయితే ఈ వనంలో పూల కుండీలు పగిలినా, చెట్లు ఎండిపోయినా, రాలిన ఆకులతో అపరిశుభ్రంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మేయర్, కమిషనర్ ఇద్దరూ మహిళలే అయినప్పటికీ దీనిపై దృష్టి సారించక పోవడాన్ని వ్యతిరేకిస్తున్నారు. *– వరంగల్, మార్చి 7*